


# మూడో తారీఖు

ఇచ్ఛాపురపు రామచంద్రం

ఒకటో తారీఖున - కొత్త చీర.

రెండున - కొత్త సినిమా.

మూడో తారీఖు ఉదయమే - ఎక్కడికో చెప్పకుండా ప్రయాణం.

దటీజ్ సునీత!

ఇవాళ మూడో తారీఖు. అందుచేత సునీత ఇంట్లో లేదు. అందుచేత - అనంత్‌కి ఏమీ తోచడం లేదు.

ప్రతి మూడో తారీఖునా సునీత ఎక్కడి వెళ్తుంది? ఏం చేస్తుంది? సుమారు నాలు గేళ్ళ నుంచీ... అంటే... పెళ్ళయినప్పటి నుంచి ఇలాగే జరుగుతూంది. ఈ మూడో తారీఖు వెనక మిస్టరీ... స్టోరీ... ఏమిటి?

ఒంటరితనం దుర్భరంగా ఉంది. ఆలోచనలు మరీ హింసిస్తూంటే... గోడమీద కాలెండర్ లోని మూడో తారీఖు వెయ్యి నాలుకలు పెట్టి తనని వెక్కిరిస్తున్నట్లుంటే, అనంత్‌కి పిచ్చెక్కిపోతున్నట్లే అనిపిస్తుంటే భరించలేక గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అతనికి కసిగా... కోపంగా ఉంది. ఏదో ఒకటి - ఏమైనా చేసెయ్యాలని ఉంది.

సంగీతం గరళంలా అనిపించి టీ.వీ. కట్టేశాడు. ఆ గదిలో ఉండలేనట్లు గబ గబ బట్టలు వేసుకుని బయటికి వచ్చాడు. రోడ్డు మీదకి, బజారులోకి వచ్చేసరికి అతని 'కేం చేయాలో తెలిసినట్లయ్యింది.

ఐదు నిముషాల అనంతరం అనంత్ మళ్ళీ తమ బెడ్ రూమ్‌లో ఉన్నాడు. అతని ముందు టీపాయ్ మీద విస్కీ బాటి లుంది.

అతనికి తాగుడు అలవాటు లేదు. కనీసం - కంపెనీ కోసమేనా తాగ లే దింతవరకూ. విస్కీ సీసాని ముట్టుకోడం అతని జీవితంలో ఇదే మొదటిసారి. అందుకు కారణ ముంది.

నిండుగా ఉన్న విస్కీ సీసా - అతని కంటికి - చీర కట్టుకున్న సునీత లాగే అనిపించింది. అంతే. "నిన్ను... ని న్నేం చేస్తానో చూడు" అంటూ కోపంగా మూత తెరిచాడు. సీసాని నోటి కందించబోతూంటే - ఒక్కసారి - తాగడం అలా కాదేమో అనిపించిం దతనికి. ఆగి... ఆలోచించాడు. నవలలూ, సినిమాలూ గుర్తుకి తెచ్చుకున్నాడు. జ్ఞాపకం వచ్చింది - విస్కీలో సోడానో, నీళ్ళో కలుపుకోవాలి.

ఫ్రిజ్ లోంచి ఐస్ వాటరూ, గ్లాసూ తెచ్చుకున్నాడు. తీరా - గ్లాసులో విస్కీ పోస్తూంటే మళ్ళీ సందేహం. ఎంత విస్కీకి ఎన్ని నీళ్ళు?

ఆలోచించాడు తీవ్రంగా. కాని తేలలేదు. చివరకి - గ్లాసులో సగం వరకూ విస్కీ పోశాడు. మిగిలిన మేరకు ఐస్ వాటరు పోశాడు. గ్లాసు నిండుగా ఉంది.

అనంత్ కళ్ళు మూసుకున్నాడు - మొదటిసారి తప్పు చేస్తున్నవాడిలా. అతనికి తాగడం తెలీదు. అందుకే ఒక్క గుక్కలో సగం గ్లాసు ఖాళీ చేసేశాడు గట గటా. గొంతు భగ్గు మంటూ మండసాగింది. కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేశాయి. ఉష్ణం - ఉష్ణేన శీతలం! మంటకి మంటే మందు... అనుకుంటూ సిగరెట్ పెట్టె తెరచి - సిగరెట్ తీశాడు. ఫిల్టర్ వేపు నోట్లో పెట్టుకోవాలా, రెండో వేపా అనేది తేల్చుకుందు కత నెక్కువ సమయం తీసుకోలేదు. అనంత్‌కి సిగరెట్ కాల్చడమూ ప్రవేశం లేని విద్యే. అందుచేత నాలుగో అగ్గిపుల్లకి కాని సిగరెట్ అంటుకోలేదు. మొదటి పీల్చుకే దగ్గు... గొంతు మంట... కన్నీళ్ళు. అయినా అతను తాగడమూ ఆపలేదు, సిగరెట్ కాల్చడమూ మానలేదు. గుండెల్లోని దుఃఖమూ, మనసులోని మహాజ్వాలల ముందు ఇవెంత - అనిపించింది.

సీసా సగం ఖాళీ అయింది. సిగరెట్లు మూడు మసి అయ్యాయి. అప్పటి కతనికి నిషా పూర్తిగా తల కెక్కింది.

ఎదురుగా సగం విస్కీతో, సగం ఖాళీగా ఉన్న సీసా అతనికి సునీత లాగే కనపడుతోంది.

"సునీ! నువ్వు - సగం నాది. మిగిలిన సగం ఎవరిది?" ముద్దగా ఉన్నా యతని మాటలు.

"....."

"మాట్లాడు. చెప్పు. ప్లీజ్... నాకు నిజం కావాలి. అది ఎంత చేదుగా ఉన్నా సరే. ఇక నా సహనం చచ్చిపోతూంది. అటో ఇటో తేల్చేసుకోవా లనుకుంటున్నాను. ఏమి టీ మూడో తారీఖు మిస్టరీ?

నిన్ను కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాను. ఎందుకని? నువ్వు మంచిదానివిలా, అమాయకురాలిలా కనిపించబట్టి. కాని నువ్వు చేస్తున్న దేమిటి?


మన పెళ్ళయి నాలుగేళ్ళు దాటింది. ఇ న్నేళ్ళ లోనూ ఒక్కసారి ఒక్క మూడో తారీఖు కూడా నాతో ఉండలేదు. ఫస్టు తారీఖున - కొత్త చీర కొనిపిస్తావు. రెండో తారీఖున - కొత్త సినిమాకి బయలుదేరదీస్తావు. ఇవేమీ చెడ్డ పనులు కావు. కాని మూడో తారీఖు ఉదయమే ఎక్కడికో వెళ్ళిపోతావు. తిరిగి రావడం నాలుగు రాత్రికో, ఐదు ఉదయానికో. మొదట్లో నే నడగలేదు - పుట్టింటి మీది మమకార మనుకుని. తరువాత ఓసారి అడిగితే-

"ఆఫీసుకి లాగే ఆలు మగల ఆఫీసుకి కూడా క్యాజువల్ లీవ్ లుండాలి" అన్నావు. మరోసారడిగితే - "చిన్న చిన్న విరహాలు భార్యా భర్తల అనురాగా న్నధికం చేస్తాయి." అని నవ్వావు. ఇంకొక సారి గట్టిగా అడిగితే - "చిన్న ఆడ బలహీనత. క్షమించెయ్యలేరూ!" అన్నావు. అంతే తప్ప నిజం చెప్పలేదు. "నీతో నేనూ వచ్చేదా?" అంటే కాదు కూడ దనేశావు. సునీతా! మూడో తారీఖున నువ్వెక్కడికి వెళ్తావు? ఏం చేస్తావు?"

అతని చేతులలో సీసా - జవాబు చెప్ప లేదు.

"నా మంచితనాన్ని అమాయకత్వంగా, వెర్రితనంలా జమకట్టి నన్నాడిస్తున్నావ్ కదూ ఇన్నేళ్ళ నుంచీ? ఎన్ని చీరె లున్నా నెల నెలా చీర కొంటూంటే పొరపాటున కూడా అడ్డుపెట్ట లేదు. నీకు చీర లంటే సరదా ఏమో అని సరిపెట్టుకున్నాను. నాకు సినిమా లంటే ఎంత తలనొ వ్వయినా, అయిష్టమైనా నీకు తోడుగా ఉండడం కోసం... నీ కోసం... నెల నెలా సినిమా చూశాను. మనకి అప్పుడే పిల్ల లొద్దండీ, మాత్రలు వాడతాను తెండి, అంటే తెస్తూ వచ్చాను. నువ్వేం చెప్పినా కాదనలేదు. అంతటికీ ప్రతిఫలంగా నువ్వు నా కిచ్చింది మానసిక క్షోభ! సునీ! కనీసం జాలైనా వెయ్యడం లేదూ నా మీద?"

విస్కీ సీసా ఏమీ మాట్లాడ లేదు. అతను గ్లాసులో నగం విస్కీ పోసి మిగిలిన నగమూ ఐస్ వాటర్‌తో నింపి రెండే గుక్కలలో ఖాళీ చేసి సిగరెట్ అంటించి - మళ్ళీ సీసాని రెండు చేతులలోకి తీసుకున్నాడు - సునీతని లాగ. అతని కన్నులలో ఎరుపు!




"చెప్పవు కదూ? అక్కర్లేదులే. అంతా నాకు తెలుసు. చెబుతా విను. సునీతా! నువ్వెవరినో ప్రేమించావు. కాని అత నడిగిన కట్నం ఇవ్వలేక మీ వాళ్ళు నిన్ను నా కిచ్చి పెళ్ళి చేశారు. పెళ్ళయినా ప్రేమని మరిచిపోలేకపోయావు. తెలివయిన దానివి కనక నన్ను అయాయకుడి చేసి ఇటు నాతో అనుకూల దాంపత్యమూ, అటు అతనితో ప్రేమా సాగిస్తూ వచ్చా విన్నాళ్ళుగా. నా చేత మొదటి తారీఖున కొనిపించుకున్న కొత్త చీర అతని ముందు కట్టుకుంటావు. నాతో చూసిన సినిమా కబుర్లు - అతనికి చెబుతావు! పిల్లలు పుడితే ప్రేమకీ, ప్రయాణాలకీ అడ్డు కదా అని పిల్స్ వాడుతున్నావు నన్ను ఒప్పించి. ఇదేగా నీ మూడో తారీఖు మిస్టరీ?" అంటూ చేతిలో సీసా పైకెత్తాడు నేలకి కొట్టి పగలగొట్టడానికి అన్నట్లు... ఆవేశంగా.

"కాదు!... ఎంత మాత్రమూ అది కాదు."

అతను తుళ్ళిపడి అటు చూశాడు. గది గుమ్మంలో సూట్‌కేస్‌తో సునీత!

అతని నిషా కొంత దిగిపోయిం దామెను చూసేసరికి.

"మీ రింత అనుమానం మనుమలనీ, మీదీ వట్టి మగబుద్ధే అనీ, ఇంత నీచంగా ఆలోచిస్తారనీ తెలిస్తే - అసలు విషయం మీకు ముందే చెప్పే దాన్ని. మీరు చాలా ఉన్నతు లనుకున్నాను." కన్నీటితో ఉక్రోషంగా అంది సునీత.

"ఏమి టా అసలు విషయం?"

"మా ఊళ్ళో - నలుగురం స్నేహితులం. చిత్రంగా నలుగురికీ ఒకే ముహూర్తంలో పెళ్ళిళ్ళు. నలుగురి కాపురాలూ పుట్టింటికి దగ్గరలోనే. మేం నలుగురమూ సరదాగా ఓ పందెం వేసుకున్నాం కాపురాలకి వెళ్ళే ముందు..."

"పందెమా?"

"నలుగురిలోనూ ఎవరు శ్రీవారి ప్రేమ ఎక్కువగా పొందుతారూ అని."

"అదేం పందెం? ప్రేమకి మీట రుండదుగా కొలిచేందుకు?"

"అందుకే నాలుగు విషయా లెన్నుకున్నాం. సాధారణంగా - మగ వాళ్ళకి చీర కొనడ మంటే చిరాకు కనుక ప్రతి ఫస్టు తారీఖున శ్రీవారి చేత కొత్త చీర కొనిపించుకోవాలి. రెండవది - మగవాళ్ళకి సినిమా లంటే తలనొప్పి కనుక... శ్రీవారితో కలిసి రెండో తారీఖున కొత్త సినిమా చూడాలి. మూడోది - పిల్లల్ని కనడం వాయిదా వేయాలి. చివరిది - శ్రీవారికి ఎక్కడికి వెళ్తున్నదీ చెప్పకుండా ఈ ఊ రొచ్చి కలుసుకోవాలి. కొత్త చీర చూపించి, కొత్త సినిమా కథ చెప్పి, స్నేహితురాళ్ళతో గడిపి - మార్కులు వేయించుకోవాలి."

"ఎన్నాళ్ళు... ఎన్నే ళ్ళిలా?" వెర్రి ముఖం వేసి చూశాడు.

"ఏభై నెలలు. సరిగ్గా ఇది ఏభయ్యో నెల. పందెం నేనే గెలిచాను. ఏభైకి ఏభై మార్కులు కొట్టేశాను. మిగిలిన వాళ్ళవి నలభై కూడా దాటలే దెవరివీ. గెలుపు నాదే కనుక మిగిలిన ముగ్గురూ నాకు పట్టుచీరా, మనకి ఆదర్శపు జంట అన్న బిరుదు ఇవ్వబోతున్నారు..."

"ఎప్పుడు?"

"వచ్చే నెల మూడో తారీఖున."

"ఆ, మూడునా! వద్దు. మ రే తారీకయినా పరవాలేదు. మూడు మాత్రం వద్దు."

"ఆ బహుమతి నేను తీసుకోదలుచుకోలేదు."

"ఏం?"

"మిమ్మల్ని ఇలా చూస్తూ, మీ మాటలు విని ఇంకా నే నా బహుమతి కర్హమైన దా న్నని ఎలా ఆత్మవంచన చేసుకోగలను?"

"ప్లీజ్... సునీ!... ఇం కెప్పుడూ ఇలా తొందరపడను. ఈ ఒక్కసారీ నన్ను క్షమించవ్వూ? తీన్ తేరా... ఆర్... అఠారా... నీకు తెలిసే ఉంటుంది... నన్ను క్షమించు." అంటూ అనంత్ సునీత చేతులు పట్టుకున్నాడు విస్కీ సీసా, సిగరెట్ పెట్టే అవతలకి విసిరేసి. ★

INTERMEDIATE
MPC & BPC
At the persistent requests of many parents we obliged to start above courses exclusively to prepare for
IIT & AI
Medical Institute
Hard workers need only to apply
- We have produced many IAS & IPS Officers
- We have also produced A.P. State Top rankers in Group-I
*If interested contact:*
SOLDIER-SCHOLAR'S
STUDY CIRCLE
9 Football Stadium
Fateh Maidan,
HYDERABAD - 500 001.
*Timings:*
*9 A.M to 12 Noon: 4 P.M. to 6 P.M.*